# రాజుగారి ఒక్కనాటి ప్రచారం

చెప్పొద్దు కానీ రాజుగారు ఏమరుపాటున్నైనా బీదసాదాను మరచిపోరు. ఆ నామమే సర్వకాల సర్వావస్థల్లో నాలుకపై తారాడుతూ వుంటుంది. వారు పందిరి మంచంపైన పడుకున్నా, పడతి బాహుబంధంలో సుఖించినా పట్టు పీతాంబరాలు ధరించినా, పంచభక్ష్యపరమాన్నాలు ఆరగించినా, డొక్కలు ఆరవేసుకున్న బక్కవాడిని తలచుకోకుండా ముద్ద ముట్టరు, కునుకు తీయరు. తాంబూలం సేవించరు. అంతెందుకు? జీవన్మరణ సమస్యలా వున్న ఎన్నికల ప్రచారాన్ని సయితం ప్రారంభం చేయరు.

అలాంటి ధర్మ మహానాయకులు తిరిగి ధర్మదండాన్ని చేతబట్టి మీ బడుగు బ్రతుకులను బాగు చేసేందుకు వోట్ల కోసం దేహి అంటూ భిక్షాటనం చేయవలసివస్తోంది.

అవసరం కొద్దీ, ఆత్మ నైచ్యానుసంధానం కల్పించుకుంటూ దేహి! అనడంలో తప్పేముంది? ఇంతకు మన జాతి జీవనమే అడుక్కు తినడం ఐనప్పుడు, మన నాయకులూ అత్యవసర వేళల్లో వోట్ల బిచ్చెం వేడితే వచ్చేలొచ్చేదో? అంతెందుకూ? మన ఆరాధ్య దైవం పరమశివుడు భిక్షాటనం చేసే కదండి జీవించాడు మామాగారు వెళ్లగొడ్తే.

అయితే సాగించండి యాత్ర! తొలి మజిలి ఎందుకైనా మంచిది, వృషోదయంగా తూర్పుదిశనుండి ప్రారంభిస్తే మంచిది.

రాజావారిది నిండైన విగ్రహం చూడముచ్చటగా వుంటారు. మాట్లాడితే వినసొంపు! వారి చేతలూ అంతే! అదంతా వో కళ!

రాజుగారిప్పుడు సొంత పని మీద భవానీపురం వచ్చారు. ఎంత భాగ్యం! తెలియక అడ్గుతాను. ప్రభువులకు ప్రజల పనులే తప్ప సొంతానికంటూ వేరే పనులుంటాయా?

ఉండవు! ముమ్మాటికీ వుండవు! అయినా యివి పరమ పవిత్రమైన పర్వదినాలు. అవే ఎన్నికలవేళలు! ధర్మం నాల్గు పాదాలా నడిచే రోజులు.

అదేటండీ? ధర్మాన్ని గొడ్డుని చేస్తూ గడ్డి తినిపిస్తారా? దాని మానాన దాన్ని బ్రతకనివ్వండి సార్!

అయ్యలారా! యిది అడ్డుప్రశ్నలకు వేళ కాదు. వేద బుక్కుల్లా వీటికి శబ్దప్రాధాన్యమే తప్ప అర్థవ్యక్తికి అంత ప్రమేయం వుండదు. సందేహాలకు తావు యివ్వకండి. నాయనలారా! ధర్మ సూక్ష్మన్ని గ్రహించడం అంత తేలిక కాదు. చెప్పింది వినండి.

రాజుగారిప్పుడు ఆపద్ధర్మ ప్రభువులుగా కొలువుంటున్నారు. మీ క్షేమాన్నే అహర్నిశలు కాంక్షించే ఆ కరుణామయులైన ధర్మ స్వరూపులు తిరిగి ప్రభువులై మీకు తమ సేవలందించాలనే తాపత్రయంతో నిద్రలో కూడా ఆ మాటే కలువరిస్తూ ఎన్నికల ప్రచారంకోసం బయలుదేరారు.

ఆహా! ఏం దొడ్డ ప్రభువులు! ఎంత జాలిగుండె! తెలుగు బిడ్డ! తెలుగు వారి చేతిలో వెన్న ముద్ద! తెలుగు తల్లి కొప్పులో చెంగల్వపూదండ! ఏం భాగ్యం.

అది నిజమే! సందేహంలేదు. అయినా! ఎవరు ఎంత ప్రజల మనిషైనా ఎన్నికలనే సరికి సొంత విషయమై కూర్చుంటుంది.

అదేటండీ? ఎన్నికలే ప్రజలకోసం, ప్రజలే వేలిముద్రల కోసం అయినప్పుడు మేమంతా అంటే ప్రజలమంతా ఏకమై వొక్కుమ్మడిగా ఏలు ముద్దెర్లేసి వోట్ల పంట పండిచమా?

మీ రంతవారని ప్రభువులకు తెలియక కాదు. అయినా యీ ప్రజాస్వామ్యంలో అందరికీ సమాన హక్కులు కల్పిస్తూ చట్టపరంగా న్యాయం చేసేందుకు అందరికీ అవకాశం యివ్వాలి. కొంత తతంగం జరగాలి. గాలి ఎప్పుడు ఎలా వీస్తుందో? అందుకు చేతి చమురు చాలా అవసరం!

మీరంటున్నది అక్షరాలా నిజమేనండి! అయితే మరి!

సొంతపని కోసం వచ్చిన ధర్మమూర్తి ప్రభుత్వపు విడిదుల్లో నివాసం చేస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తారా? ఆ పాపిష్టి ప్రభుత్వపు సొమ్ము 'ఛా' అదేం మాట? ఐయామ్ సారీ, అదే ప్రజలసొమ్ము తాకి మైల పడ్తారా? రామ! రామ! ఎంతమాట! అలా అనడానికి నాకూ, వినడానికి మీకూ ఎన్ని గుండెలు? అందుకే చిల్లి గవ్వకూడా ప్రభుత్వపు సొమ్ము తాకరు.

నిజమే! ఆ పాపపు సొమ్ము ఎన్నెన్ని సుంకాలూ, ఎన్నెన్ని ట్యాక్సులు వేసి కూడబెట్టిందో? అది తనకెందుకూ? తనకేం తక్కువని?

తక్కువంటూ ఏంలేదు కానీ, తమ జీవితాన్నే మన మేలుకోసం ఎత్తు కట్టినప్పుడు వారి సొంత సొమ్మును ఖర్చు చేయించడం మన తెలుగు సిరికి లోటు. తెలుగు వారి అభిమానం దెబ్బతినదూ?

మరి? ప్రచారమండి బాబూ!

ప్రచారానికేంలెండి! దానంతటదే సాగుతుంది. చూడాల్సిందల్లా వారి విడిదికి తగిన వసతి, భోజనాది యితర సౌకర్యాలు.

అదేమంత బుర్రగోక్కోవలసిన సమస్య బాబూ? ఒక్కరెండు రోజుల బస, తప్పితే రెండు పగళ్ళూ మూడు రాత్రుళ్లు, అంతేగదా?

అంత తేలిగ్గా కొట్టి పారేస్తూ విషయానికి మంగళం పాడకు. అప్పుడే యీ జటిల సమస్యకు పరిష్కారం కుదిరినట్లు 'స్వస్తి' చెబుతూ ఫుల్‌స్టాప్ పెడ్తే ఎలా?

అయితే మిగిలిందేటండి?

మిగులుబడే ఎక్కువుంది. వారొచ్చిన పని సామాన్య విషయం కాదు. ఎన్నికలనేది కేవలం ఒక మిష. అసలు విషయం; చదువుల్లేక మూఢులై దారిద్ర్యంతో బక్కచిక్కి, చైతన్యం గోలుపోయి బీడువారిన భూముల్లా మిగిలిన తమ అక్కాచెల్లెళ్లనూ, అన్నా దమ్ములను వుద్ధరించి అంటే పైకి లేవట్టి జాగృతిని నింపే ప్రచారం కోసమే వచ్చారు. కానీ స్వార్థం కోసం రాలేదు.

ఆ మాటే మరీ మరీ చెబితే అనుమానం వస్తాదండి!

అహా! మీలో అప్పుడే విమర్శనా శక్తి తొంగి చూడ్డం ప్రారంభించింది. ఆఁ అసలు విషయానికి వద్దాం.

ప్రచారం అంటే వుత్తుత్త మాటలా? ఈ రోజుల్లో? ఆ సంరంభం, ఆ సన్నాహం ఏం చిన్న సన్నదా? సర్కస్ డేరా వేసినంత పని. ఒంటెలూ, ఏనుగులూ, గుర్రాలూ, కోతులూ అక్షరాల ప్రత్యక్షం కాకపోయినా వాటిని తలదన్నే పాలిత వర్గం, తెకతేరకు మేసి బలిసిన బలగమూ వుంటుంది.

నిలువెత్తు మనుషులు మెడలు సారించి చూచినా చూపుకు అందీ అందని రథం అంబారీ ఏనుగులా కదలాలి. దాని వెంటనే బాకాలూ, భజంత్రీలూ, పీకెలూ, సన్నాయిలూ, తప్పెట్లూ, తాళాలూ, కరతాళబృందాలూ, వోహో అహా! కాండ్లూ, చిచ్చుబుడ్లు, జెండాలూ, మైకులూ, స్పీకర్లు, లౌడు స్పీకర్లు, కుఁయిమంటే కుత్తుకలు నొక్కి ముందుకు సాగే బంట్లు, యివన్నీ వారి భుజకీర్తుల్లా వెలుగుతూ రావాలి. ఇంతటి తెలుగుకీర్తికి గోచిపాతలాంటి ప్రభుత్వంపు వసతి గృహం ఏమూల.

ఇవన్నీనా? అండీ! అయితెమాయె! ఇప్పుడు ప్రజలే ప్రభువులూ, ప్రభువులే ప్రజలైనప్పుడు మా, మీ సొమ్ముంటూ వేరే వుంటుందా. ఎంతైనా సరే! వెచ్చించాల్సిందే కానీ సర్వేఖాసులోంచి వో చెల్లని చిల్లిగవ్వ కదలడానికి వీల్లేదు. అది కట్టిన ముడుపు కదండీ? ఆ మాత్రం తెలియదా?

అయితే రాజుగారి హుందాకూ, అభిరుచులకూ అలవాట్లకూ అనువైన తీరులో ఆంధ్రుల కళాభిమానానికి ప్రతీకగా విడిది ఏర్పాటు కావాలి. రాజుగారి పై ప్రజానీకానికున్న ప్రేమాభిమానాలకు చిహ్నంగా తూగాలి. ప్రభుత్వపు ప్రత్యేకాధికారి నైపుణ్యానికీ, తదితర సిబ్బంది చాకచక్యానికీ యిదో పరీక్ష సమయం. తగుచర్యలు తీసుకొమ్మంటూ రాజశాసనం గుప్తంగా దండోరా వేయబడిందిలే!

ఇంతకూ బస ఎక్కడో?

మీ తిక్క కాకపోతే బస ఎక్కడేమిటండీ! తెల్లవారే వరకే అక్కడి ప్రజల కళాభివ్యక్తీ, దీటుగా వారి సౌందర్యారాధనం నిటారుగా నిలబడి తల ఎత్తుకు చూచేలా వసతి ఏర్పాటైంది. ఆరుబైట, ఏపుగా ఎదిగిన సర్వీచెట్లు ప్రహారీగోడలుగా మధ్య గోముగా పెరిగిన పచ్చగడ్డి మఖమల్ తివాచీ పరిచిన చోట, గురువిందలూ, కొండమల్లెలు అల్లి బిల్లిగా అల్లుకుని సువాసనలతో గండు తుమ్మెదలను ఆహ్వానించే చోట, నిర్మలమైన కమ్మటి సెలయేటి నీటిని ఆశించి, లేళ్ళూ, వింత వింత పక్షి జంటలు చేరుతూ కనువిందొనర్చే చోట ఏర్పటైంది. ఆరేబియా రాజప్రసాదాన్ని తలపించే కుటీరం. ఆ గుడారానికి ఆవలివైపున దూరంగా చిరుత, సివ్వంగి, సింహశార్దూల, గజ, మర్కటాదుల ధ్వనులూ, నిశివేళ, తరచుగా వినిపిస్తాయి అంటారు.

విచిత్రాలు కతలు కతలూగా వింతలొలుకుతున్నాయి. కుటీర నిర్మాణం మరీ చిత్రకతగా మారింది.

ఆహా! రాజగారెంతటి కరుణామయులు? సకల జీవకోటి సహజీవనలాలసులు! వారి మనస్సే పాల సముద్రం. అందులో పశుపక్ష్యాది ప్రేమ పైకితేలిన వెన్నముద్ద!

ఇంతవరకూ మానవజాతినీ తెలుగుతనాన్నీ తన బిడ్డలుగా భావించి గుండెలపై మోస్తూ తానే వారుగా జీవిస్తున్నారనుకున్నాం, కానీ, యిప్పుడు? అబ్బ! తలచుకుంటేనే వొళ్లు జలదరిస్తూంది, నోరులేని మూగజీవులను కూడా తనతోటి వారిగా మన్నించి, వాటి ఆత్మ గౌరవాన్ని సముద్ధరిస్తూ ఆ జంతుజాలం మధ్యనే పటకుటీరం నిర్మించుకుని గడుపుతామనడం ఎక్కడైనా విన్నామా? కన్నామా? లేదు, అయినా, యీనాడిక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నాం.

జిందాబాద్! జిందాబాద్! నేతలు వర్ధిల్లాలి!

జీవ కారుణ్య సంఘం వారు ఆలోచించలేదేమో? కానీ, పశుపక్ష్యాదులకు కూడా వోటింగ్ హక్కు అంటూ కల్పించి వుంటే? యిప్పుడు యీ యావదాంధ్ర దేశంలోని పిపీలికాది సింహపర్యంతం తమ పాదాంగుళీ లాంఛనాంకితమైన వోట్ల బ్యాంకును మన రాజుగారి పరం చేసివుండక పోవునా? అయినా? మించుకుపోయిందేముంది? ఆ వెలతి పూరించేందుకు మేం లేమా?

సెబాస్! కాదన్నదెవరు? అయినా; సోదరులారా ఒక్క నిమిషం మీ చెవులను నా వశం చేయండి.

మరో ముఖ్యమైన విషయం! ప్రభువులు కేవలం భూమి పుత్రుడైన ప్రకృత్యారాధకుడు మాత్రమే కాదు సుమా! అత్యంతాధునిక పరికరాపాదిత సౌకర్య సంజనిత సుఖనందితులూ, జీవాజీవ సమదృక్కులు, అందుకే వారి యీ పటకుటీరం. దూరదర్శన, దూర శ్రవణ దూరభాషణ, ఛాయాగ్రహణ, కాంప్యూటర్యాది యాంత్రిక వస్తు పరిశోభితమై తూర్పు పడమరలకూ, పాత కొత్తలకూ ఏకసూత్రం పట్టినట్లుగా కన్పిస్తూంది. పరివారమంతా భక్తులై, కింకరప్రాయులై ప్రభుసేవలో మైమరచి 'తవ క్రీతదాసోఽహం' అన్నట్లు కన్పిస్తూంది.

రాజుగారు కల్పవృంలాంటి వారు. మరిలా ఏకఛత్రాధిపతులు వారి ఆశ్రయాన్ని కాంక్షించి కాకుల్లా చేరుకునే అతిథులకూ, శరణాగతులకూ, కుర్చీ మోపులకూ, కుర్చీ కాంక్షులకూ, చిన్న తిరిపాలకూ, పెద్దమద్దులకూ భోజనాది వసతులూ, విశ్రామస్థానాలూ, మంతనపు చావళ్లూ, అన్నీ సజావుగా ఏర్పాటయ్యాయి.

నిజమే! అంగములు, వినా అంగి సుఖించునెట్లు? న్యాయం తప్పని నడవడి ప్రభువులది.

సవ్యంగా జరిగిన ఏర్పాట్లు పరిశీలించి మెచ్చుకోలుగా కళ్లతో నవ్వారు రాజుగారు. సర్వసన్నాహాలతో సర్వాంగ సుందరంగా అలంకరింపబడ్డ రథం అంబారీ ఏనుగులా కదుల్తూ వచ్చి నిల్చుంది. జన సందోహం కదిలింది. అప్సరసలవంటి అంగనామణులు రథానికి మంగళ హారతులెత్తారు. ప్రభువులు సకల భద్రాలతో, మంగళాశంసనలతో కుడికాలు మోపు తూరథాన్ని అధిరోహించారు.

'వచ్చారొచ్చారు. మారాజులొచ్చారు. మావూరొచ్చా'రంటూ భవానీపురం అంతా తాకితే చాలు విచ్చుకునే మొగ్గలా మారింది. దారి పొడుగునా జయజయాకారాలతో సాగుతూ వేదికచేరి తొలి వుపన్యాసానికి శ్రీకారం చుట్టారు. రాజుగారు.

అయ్యారే! ఆశ్చర్యం! భళారే వుపన్యాసం! అది వుపసన్యాం కాదు. ప్రభువుల ఎదలో నిరంతరం గూడు కట్టుకుని మూల్గుతూ వున్న దీనుల కన్నీరు పన్నీరై జాలువారింది. ప్రచ్ఛన్నంగా వున్న సమతా మమతల భండాగారం ఆవిష్కృతమై కరిగి ప్రవహించింది. ఇన్ని నాళ్లూ తాము చూస్తూన్న బక్కచిక్కన వాడి ఆకలి డొక్కలూ, విద్యాగంధంలేక దారిద్ర్యంలో, రోగపురొంపిలో యీగలు ముసిరిన మొర్రి చిప్పల్లా జీవిస్తూన్న వింత పశువులూ, అవిటితనంతో, వెర్రెత్తిన మతితో తోకలేని కోతుల్లా బ్రతికే బ్రతుకులూ, ఏనీడా లేక వుతికి ఆరవేసిన పాతల్లాంటి అనాథలూ కొరకచ్చుల్లా తన ఎదను రగిల్చగా బాధాతప్తమై కరిగి మాటల రూపంలో ప్రవహిస్తూన్న శ్రీవారి హృదయ నవనీతం! అది.

అందుకే దానికంత ఆకర్షక శక్తి. మనకింతమైమరపు.

దినరాజు మెలమెల్లగా తల్లివొడిలో నిద్రించడానికి జారుకుంటున్నాడు. మనరాజుగారూ అలసి పోయినట్లున్నారు. విడిది చేరి, స్నానాదులు ముగించుకుని తగు మాత్రంగా భోజనం ఆరగించి భావి కార్యక్రమాల వివరాలు ఆంతరింగికులతో ముచ్చటించి విశ్రమించడానికి లేచారు. విశ్రమించారు.

పాపం నోరు లేకపోయినా ప్రాణులుగా యీ మట్టిపై జీవించినందుకు ఆ జంతువులకూ ఋణాన్ని యీగాలనే వుంది. అందుకే అవన్నీ వాటి వాటి అర్హతలనూ, తాహతులనూ పురస్కరించుకుని కృతజ్ఞతలు చెప్పడమో, బాధలు తీర్చు మంటూ విన్నపాలు చేయడమో, గడ్డీగాదం సరిపోలేదంటూ మొరపెట్టడమో? వేటకాడ్ర బెడదనుండి కాపాడుమనో? మంచి నీటి సదుపాయం చేయమంటూ నో ప్రార్థనలు చేసినట్లు గజ, సింహ, శార్దూల, మర్కటాదులన్నీ ఘీంకృతులతో, గర్జనలతో, గాండ్రిపులతో దిక్కులన్నీదద్దరిల్లేట్లు ధ్వనులు చేస్తున్నాయి.

రాజుగారు వినోదంగా కొత తడవు ఆలకించారు. అయినా పశువు పశువే!

ఇంతకింతకు ఆ ధ్వనులు రాజుగారి సహనాన్ని పరీక్షించసాగాయి.

లేచారు! కాదు; రాజుగారి గుండె జీవజంతు ఆర్తనాదాలకు తట్టుకోలేక చెరువైంది. ఎంత భూతదయాపరులు?

కింకర్తవ్యం? ఏమీలేదు. కార్యకర్తలను పిలిచి బసను మార్పించడమే! అందవలసిన కర్మచారికి వర్తమానం పంపబడింది.

పాపం! ఆ అధికారి ఒక్కసారి జుమ్మంటూపొట్మరించిన చెమటలనః వొత్తుకుంటూ రాజావారి బసకు దౌడు తీసి కార్యకర్తలను వుద్దేశించి.

చూడండీ! ఒక్కవందరూపాయాలు చెల్లించి ఈ రాత్రికి సర్కారు వసతి గృహంలో సుఖంగా నిద్రించవచ్చు, ఏర్పాట్లు చేయిస్తాను అంటూ వినమ్రంగా విన్నవించుకోవడం జరిగింది.

ఔరౌరా? ఎంతమాట? ఎంతమాట! ఏమేమీ? రాజుగారు సుఖనిద్రకోసం అదికూడా సగం గతించిన రాత్రికోసం సుంకంబు చెల్లించుటయా? ఎప్పుడైనా అలాంటి పనికి మాలిన పనిచేశారా? ప్రజలమనిషిగా సేవలను పిండుకున్న ప్రజానీకం ఆ మాట విని సహించగలదా? వారి ఆత్మాభిమానానికి ఆఘాతం కలుగదా?

ఈ రాత్రి ప్రభువుల కీర్తిగాన రూపంలో బుర్రకథలూ, హరికథలూ సాగవలసిందే దివిటీలు తెప్పించండి. ఆ కాగడాల వెలుగులో వన్యప్రాణులు తమ అర్జీలు స్వీకరించబడ్డాయి అంటూ పోయి అడవులల్లో దూరుతాయి. సురక్షితమైన స్థానంలో గొల్లైన ఎత్తి కాపుపెట్టండి.

మరుక్షణమే 'హుకుం' కార్యరూపాన్ని పొందుతూ ప్రత్యక్షమైంది ఇంతవరకూ ఖర్చించిన కొన్ని వేల రొక్కం నేల పాలైంది. మరో పెద్ద మొత్తానికే గండి ఏర్పడే ప్రమాదం దాపురించింది.

అయితే ఏం? పని జరిగి తీరవలసిందే!

ఈసారి పని పకడ్బందీగా జరిగింది. రాజుగారు సుఖనిద్రచేసి తిరిగి గుడార ప్రవేశం చేశారు. ఇంకా బుర్రకథ సాగుతూనే వుంది. రాజుగారు ప్రసన్న వదనులై చెయ్యెత్తి తమ సంతోషాన్నీ సంతృప్తినీ వ్యక్తం చేశారు. కథకులు మంగళం పాడారు.

మళ్లా ప్రచార రథం సర్వసన్నద్ధమై సిద్ధంగా నిల్చుంది. రాజుగారు దిగ్విజయం చేసినంత వుత్సాహంగా వున్నారు. ఎంతో ముచ్చటగా అలంకరించుకున్నారు. కుచ్చిళ్లు పోసికట్టిన పట్టుధోవతి, విలాసంగా కప్పినకండువా గాలికి రెపరెపలాడుతూ నదీ తరంగ విలాసాన్ని పంచుతూ వుంటే వో చేత్తో పూలమాలలందుకుంటూ మరో చేత్తో చిన్నారుల పైకి విసుర్తూ వుంటే ప్రచార రథం ప్రగతి పథంలో జెండాను ఎగురవేస్తూ ముందుకు సాగింది.

ఈ రథంలో రాజుగారు రథికులై విరాజమానంగా వెలుగుతూ కాలిన కడుపుల గూర్చీ, ఎండిన డొక్కల గూర్చీ, కారుతున్న కన్నీళ్ల గూర్చి నిద్రాణమైన జనశక్తి జాగరణను గూర్చి అనర్గళంగా వుపన్యసిస్తూ ముందుకు సాగి వెళ్లారు.

ఒక్కరాత్రి రెండు పగళ్ల ఖర్చులెక్కల సర్దుబాటును ఆలోచించిన అధికారికి వేడెక్కి గుండె వేగాన్ని రెట్టించి హెచ్చరికలు చేస్తుంటే, ఆ వేగాన్ని అదుపు చేసేందుకు భార్య ఆసరగా తన ఎదను పంచింది పాపం.